క్లుప్తంగా

ఈఎన్‌సీని కలిసిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సంజీవ్‌రావును బుధవారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గంగాపూర్, పస్పుల, రాంపూర్ వంతెనల నిర్మాణానికి టెండర్లు పిలవాలని కోరారు. ఇందుకు ఈఎన్‌సీ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని.. చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా బస్తా ధర రూ.270, 20:20:13 బస్తా ధర రూ.1140 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను తీసుకురావాలని సూచించారు.

గోబర్‌గ్యాస్ నిర్మాణం పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో జరుగుతున్న గోబర్ గ్యాస్ నిర్మాణ పనులు, కిచెన్‌గార్డ్, పల్లె ప్రకృతివనాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ బుధవారం పరిశీలించారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా వేములవాడ నవీన్, గౌరవ అధ్యక్షుడిగా తునికి రాజన్న, ఉపాధ్యక్షుడిగా గాంధారి సురేశ్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా నరేంద్రచారి, ప్రచార కార్యదర్శిగా సిద్దు, ముఖ్య సలహాదారులుగా నా రా యణ, శ్రీధర్, తిక్కన్న, సత్యనారాయణ ఎన్నికయ్యారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కుంటాల: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ శక్తి భవనంలో నిర్వహించిన మండల సమాఖ్య మహాజన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. 2022–23లో చేపట్టిన లావాదేవీలపై చర్చించారు. డీపీఎంలు జ్ఞాను, వెంకటసాయి ప్రసాద్, ఏపీఎంలు అశోక్, భోజన్న, డీఎంజీ పోశెట్టి, సీసీలు పెంటన్న, కవిత, యూసుఫ్, అకౌంటెంట్ శివప్రసాద్ తదితరులున్నారు.

యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా అల్మాస్‌ఖాన్



ఖానాపూర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అల్మాస్ ఖాన్‌ను ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆ పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శివసే నారెడ్డి, జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సూర్భి ద్వివేది బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అతడి నియామకం పట్ల కాంగ్రెస్ పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఈవీఎంలపై అవగాహన

తానూరు: మండలంలోని సింగన్‌గాం, నంద్‌గాం గ్రామాల్లో బుధవారం ఆర్‌ఐ మోహన్ సింగ్ ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానం, ఓటుహక్కు ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో ఓటర్లు తదితరులు ఉన్నారు.

కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హైదర్ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ద్యావరశెట్టి రవీందర్, సోఫీ ఇమ్రాన్, లోకేశ్వరం మండల నాయకులు షేక్ ఇలియాస్, చిన్నన్న, షేక్ ఖదీర్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ఉత్తదేనా?

- తగ్గిన రూ.20కోట్ల నిధులు
- పైపులైన్ వేసి కుండీలు నిర్మించలేదని పిప్రిలో పనులు అడ్డుకున్న గ్రామస్తులు
- నిరాశలో ఆయా గ్రామాల రైతులు
- నిర్మాణం పూర్తయితే సస్యశ్యామలం కానున్న నాలుగు వేల ఎకరాలు
- యాసంగికి నీరు ఇవ్వాలని వేడుకోలు
- నిధులు మంజూరవగానే పూర్తి చేస్తామంటున్న అధికారులు



రాయపూర్‌కాండ్లీలో నిలిచిపోయిన పనులు



పిప్రిలో నిలిచిపోయిన పంపుహౌస్ పనులు



నిలిచిన కుండీ పనులు

లోకేశ్వరం: పల్లపు ప్రాంతంలో ఉన్న నీటిని.. మెట్ట పొలాలకు మళ్లించి బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసే ఎత్తిపోతల పథకం పలు చోట్ల పనికి రాకుండా పోతుంది. లోకేశ్వరం మండలంలోని లోకేశ్వరం, రాయపూర్‌కాండ్లీ, గొడిసెర, మొహాళ, నగర్, భాగాపూర్, ధర్మోర, పిప్రి గ్రామాల్లోని రైతుల భూములకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పిప్రి గ్రామ సరిహద్దు ప్రాంతంలో గోదావరి ఒడ్డున 2021 మార్చి23న ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారు. ప్రభుత్వం సైతం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.59 కోట్లు మంజూరు చేసింది.

తమ ఊరిలో కుండీలు నిర్మించలేదని పనులు అడ్డుకున్న పిప్రి రైతులు..

గోదావరి నీటిని ఎత్తిపోసుకుంటే తమ బీడు భూములు సస్యశ్యామలంగా మారుతాయని ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. పిప్రి సరిహద్దు సమీపంలోనే పథకం నిర్మిస్తున్న అధికారులు పిప్రి గ్రామ రైతులకు చెందిన 250 ఎకరాలకు సాగునీరు అందేలా సర్వే చేశారు.. కానీ ఆ ఊరిలో పైపులైన్ వేసి కుండీలు నిర్మించలేదు. నిధుల తగ్గింపుతో మళ్లీ ఆయకట్టు తగ్గించడం, రైతులను సంప్రదించకుండా అధికారులు కమిటీ ఏర్పాటు చేయడంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తూ ఈ ఏడాది మే నెలలో పనులు ఆపివేయించారు.

రూ.20 కోట్ల నిధులు తగ్గించడంతో ఆందోళన

పిప్రి గ్రామ సమీపంలో గోదావరి నది నుంచి 3 కి.మీ ఇంటెక్ లైన్, ఇంటెక్ బావి, ఎనిమిది గ్రామాల ఆయకట్టుకు 36 కిలోమీటర్ల మేర పైపులైన్ కోసం మొత్తం రూ.79 కోట్లు అవసరం కాగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. కాగా గతేడాది ప్రభుత్వం రూ.59 కోట్లు నిధులు విడుదల చేసింది.

పిప్రి ఎత్తిపోతల పథకం ఆయకట్టు వివరాలు

గ్రామం	ఎకరాలు
రాయపూర్‌కాండ్లీ	1846
గొడిసెర	306
మొహాళ,నగర్, భాగాపూర్	1373
పిప్రిలో	250
ధర్మోర	177
లోకేశ్వరం	262
మొత్తం	4,214

11 కిలోమీటర్లే జరిగిన పనులు..

ప్రభుత్వం నిధులు తగ్గించడంతో ఇంటెక్‌బావి, ఇంటెక్ లైన్, విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణంతో పాటు మేర 11కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదే జరిగితే 25 కిలోమీటర్ల పైపులైను నిర్మాణం నిలిచిపోయి మొత్తం 4,214 ఎకరాల ఆయకట్టులో కేవలం 1,500 ఎకరాలకు మాత్రమే నీరందే వీలుంటుంది. దీంతో పథకం లక్ష్యం ప్రశ్నార్థకం అవుతుంది.

మళ్లీ చిగురించిన ఆశలు..

అప్పటి నుంచి పనులు ప్రారంభం కాకపోవడంతో పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలోని గ్రామాల రైతులు దీని నిర్మాణంపై సందిగ్ధంలో ఉన్నారు. ఇటీవల నిర్మల్ పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కలిసి.. ఈ పథకానికి నిధులు మంజూరు చేయాలని కోరడంతో మళ్లీ రైతుల్లో ఆశలు చిగురించాయి.

పనులు పూర్తి చేయండి



పిప్రి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి యా సంగిలోనైనా నీరందించాలి. నాలుగు నెలల కిందట పిప్రి గ్రామ రైతులు పనులను నిలిపివేశారు. మిగతా రూ.20 కోట్లు కూడా మంజూరు చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– నాలం గంగాధర్, రాయపూర్‌కాండ్లీ

మా భూములకు నీరివ్వాలి



మా ఊరుకి ఆయకట్టు తక్కువ ఉంది. మాకు గొడిసెర, నగర్, మొహాళ గ్రామాల శివారులో భూములున్నాయి. మా భూముల గుండా పైపులైన్ వేశారు కానీ ఎక్కడా కుండీలు నిర్మించ లేదు. మా భూములకు నీరు అందించడం లేదనే పనులు అడ్డుకున్నాం. పిప్రి శివారులోని భూములకు నీరందించాలి.

– రాజేశ్వర్, పిప్రి

మళ్లీ ప్రతిపాదనలు పంపించాం

గతంలో చేసిన సర్వే ప్రకారం 4,214 ఎకరాలకు సాగు నీరందేలా అన్ని చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం విడుదలైనా నిధులు సరిపోవని ఉన్నతాధికారులకు నివేదించాం. అదనంగా రూ.20 కోట్లు కావాలని ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలోని చివరి ఆయకట్టుకు తప్పనిసరిగా నీరందేలా చూస్తాం.

– అనిల్, ఇరిగేషన్ డీఈ, భైంసా

యూత్ కాంగ్రెస్ మండల కమిటీల ఎన్నిక

ఖానాపూర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ఇసాక్, యూత్ జిల్లా అధ్యక్షుడు ఇమ్రానుల్లా ఆదేశాల మేరకు యూత్ మండల కమిటీలు ఏర్పాటు చేసినట్లు యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు కిశోర్‌నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్ మండల అధ్యక్షుడిగా పి.సచిన్, కడెం అధ్యక్షుడిగా ఎ.శ్రీకాంత్, పెంబి అధ్యక్షులుగా జి.భీము, దస్తురాబాద్ అధ్యక్షుడిగా సీహెచ్.సుభాశ్, ఇంద్రవెల్లి అధ్యక్షుడిగా జి.అజయ్, జన్నారం అధ్యక్షుడిగా పి.రాకేశ్, పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మడిగెల అనిల్‌ను నియమించినట్లు తెలిపారు.

యూటీఎఫ్ కార్యవర్గంలో చోటు

నిర్మల్‌రూరల్: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో ఒకరికి చోటు కల్పించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా బాగుల చంద్రశేఖర్‌ను నియమించామన్నారు. ఇందులో చేరిన వారికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని కోరారు.

మండల సమాఖ్య కార్యవర్గం

కుంటాల: కుంటాల మండలం సమాఖ్య కార్యవర్గాన్ని బుధవారం కుంటాలలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా బ్యాగరి లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా సిందే బోజాబాయి, కార్యదర్శిగా మాలేగాం సురేఖ, సహాయ కార్యదర్శిగా రత్న మాల, కోశాధికారిగా అనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని నూతన సభ్యులు తీర్మానం చేశారు.

ఆర్డర్ కాపీలు అందజేత

కుంటాల: పంచాయతీ కార్యదర్శులను ఇటీవల ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిన విషయం తెలిసిందే. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీఓ రహీం పంచాయతీ కార్యదర్శులకు ఆర్డర్ కాపీలు అందజేశారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

- ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

కుంటాల: ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్లూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే ఆరోగ్య ఉప కేంద్ర నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దవాఖానాలు ఏర్పాటు చేశామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జారాం యాదవ్, సర్పంచ్ పద్మాబాయి, వైస్ ఎంపీపీ మానిక నవీన్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్, ఎంపీటీసీ మధుకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్‌గౌరి, వైద్యురాలు శృతిరెడ్డి, లక్ష్మణ్ పటేల్, రమణ, దశరథ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన



మల్లాపూర్‌లో పరిశీలిస్తున్న ఎంపీడీవో శేఖర్



జగదాంబతండాలో..

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, మల్లాపూర్, ధర్మారం వంటి గ్రామాల్లో బుధవారం అధికారులు గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటిస్థలం, ధ్రువపత్రాల వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని జగదాంబతండాలో బుధవారం ఎంపీడీవో రమేశ్ క్షేత్రస్థాయిలో గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంగేశ్ తదితరులు ఉన్నారు.

వాజ్‌పేయికి నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి భైంసాలో ఘనంగా నిర్వహించారు. బుధవారం సంతోషిమాత నగర్‌లో బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పవార్ రామారావుపటేల్ యువసేన ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, నాయకులు బాలాజీ సూత్రావే, పోశెట్టి, అనిల్, నందు, నాగనాథ్, తదితరులున్నారు.

అనాథలను ఆదుకుంటున్న నేతలు



పిల్లలను ఓదారుస్తున్న జెడ్పీటీసీ జానుబాయి

ఖానాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలను బుధవారం బీజేపీ నియోజకవర్గ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి పరామర్శించారు. బావాపూర్(ఆర్)లో అనాథ పిల్లలు కళావతి, జశ్వంత్‌ను పరామర్శించి నెల రోజులకు సరిపడా సరుకులు, రూ.వెయ్యి ఆర్థిక సాయం అందజేశారు. పాత ఎల్లాపూర్, ఎర్వచింతల్ గ్రామానికి చెందిన పెద్దులు, కోల నర్సయ్యలు గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట బాస రాజేశ్వర్, పంతంగి మోహన్, పవన్, గణేశ్, నిఖిల్, మల్లేష్, పుల్లయ్య, శేఖర్, వినోద్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామానికి చెందిన బత్తుల కళావతి, జశ్వంత్ అనే పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి ఐకే రెడ్డి పీఏ కృష్ణంరాజు మంగళవారం రాత్రి బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి మూడు నెలలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె, వంటసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, దూడం శ్రీనివాస్, ఎడ్ల రాజేశ్వర్, భీమేశ్వర్, రవి, రాజన్న, బి.రమేశ్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

20న ఆత్మీయ సదస్సుకు తరలిరావాలి

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 20న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సదస్సుకు ఉమ్మడి జిల్లా నుంచి ఉద్యమకారులు తరలి రావాలని ఉద్యమకారుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ కోరారు. బుధవారం నిర్మల్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకష్ణ గౌడ్, నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు సామ కిరణ్‌రెడ్డి, రాజన్న, రాజేందర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో



దిలావర్‌పూర్‌లో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

దిలావర్‌పూర్: నిర్మల్ మాస్టర్‌ప్లాన్‌తో నష్టపోతున్న రైతులు, ఆయా గ్రామాల ప్రజల కోసం దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ అటవిక చర్య అని ఆ పార్టీ నాయకులు పీసరి శైలేశ్వర్, సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు జంగం వీరేశ్ అన్నారు. ఆయన అరెస్టును నిరసిస్తూ బుధవారం సాయంత్రం ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్మల్– భైంసా రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సమీప గ్రామాల నాయకులు సైతం రాస్తారోకోలో పాల్గొనడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గింది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి బీజేపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు నిరంజన్ రెడ్డి, సాయినాథ్, మంద మల్లేశ్, ఉదయ్‌గౌడ్, అర్జున్, శ్రీకాంత్‌రెడ్డి, రమణ, సాయిరెడ్డి, రామ్‌రెడ్డి, సాయన్న, సుధాకర్, యోగేందర్, రమేశ్, విజయ్, ముత్యం పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి గృహ నిర్బంధాన్ని నిరసిస్తూ ఆపార్టీ నాయకులు మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా బుధవారం జిల్లా కేంద్రంలో మహేశ్వర్ రెడ్డి నిరసన తెలుపుతారనే సమాచారంతో పోలీసులు ఆయనను గృహనిర్బంధం చేశారు. పోలీసులు వచ్చి నాయకులను స్టేషన్‌కు తరలించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు గోవర్ధన్, చిన్నయ్య, లక్ష్మణ్, భరత్ నారాయణ, రవి, జీవన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఏపీఎంకు సన్మానం

కుంటాల: కుంటాల ఏపీఎంగా పని చేసిన భోజన్న ఖానాపూర్‌కు బదిలీ అయ్యారు. ఆయనను బుధవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, సీసీలు పెంటన్న, కవిత, యూసుఫ్, వీవోఏల సంఘం మండల కన్వీనర్ మహేశ్, వీవోఏలు దేవన్న, గజ్జారాం, కమ్రుద్దీన్, గౌతం, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల: ఉత్తమ సేవలందించిన కుంటాల ఎస్సై హన్మాండ్లు ఇటీవల మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఎస్పీ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఆయనను మాజీ ఆత్మ చైర్మన్ సవ్వి అశోక్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేత ముత్యంరావు సన్మానించి అభినందించారు.

సుహాసినికి సన్మానం

ముథోల్: మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన జాదవ్ మాణిక్‌రావు–నీలాబాయి దంపతుల కూతురు జాదవ్ సుహాసిని ఇటీవల ఎస్సైగా ఎంపికైన విషయం తెలిసిందే. బుధవారం ఆమెను గ్రామంలో బీజేపీ నాయకులు పవార్ రామారావ్ పటేల్ కలిసి ఘనంగా సత్కరించారు. సుహాసిని మాట్లాడుతూ గతంలో తాను రామారావ్‌పటేల్ ఏర్పాటు చేసిన ఉచిత స్టడీ సర్కిల్‌లో తీసుకున్న శిక్షణ ఉద్యోగం సాధించేందుకు ఉపయోగపడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గన్నోర ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ బాబు, కిష్టారెడ్డి, మోహన్‌రెడ్డి, రమేశ్, పోతన్న, రఘుపటేల్, తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న దుర్గం నూతన్ కుమార్

ఖానాపూర్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో పేదలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో 110 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం.. అందులోంచి ఏ ఒక్క నిరుపేదకు ఇంటి స్థలం కేటాయించలేదన్నారు. అందులో కేవలం 400 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి అనర్హులకు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే పేదలకు స్థలాలు కేటాయించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తొడసం శంభు, నాగెల్లి నర్సయ్య, వర్మ తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

చిన్నవర్షానికే గుంతలు



భైంసారూరల్: భైంసా నుంచి మహాగాం వెళ్లే దారిలో ఉన్న సిద్దూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్డంతా బురదమయంగా మారింది. అధికారులు సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: గోపాలకృష్ణారెడ్డి, భైంసా ఎంపీడీవో, **ఫోన్:** 99085 23064

కుష్ఠు నివారణకు కృషి చేద్దాం

దస్తురాబాద్: కుష్ఠు నివారణకు అందరం కృషి చేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు(ఎల్‌డీసీ) కార్యక్రమం చేపట్టారు. శరీరంపై స్పర్శ లేకుండా గోధుమ రంగు మచ్చలుంటే వైద్యులను సంప్రదించాలని వారు సూచించారు. ఈనెల 31 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే ఉంటుందన్నారు. ఆశావర్కర్లు గోదావరి, సుజాత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్‌లో ఇడగొట్టు నారాయణ తల్లి లక్ష్మి మంగళవారం రాత్రి మృతి చెందింది. బుధవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు జాన్సన్‌నాయక్ బాధితుడి ఇంటికెళ్లి పరామర్శించారు. వారి వెంట నాయకులు దండుగుల ధర్మపురి, కారింగుల సుమన్, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.